# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. జనాభా నిర్వహణ విధానంపై సమీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

2. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల పనులను మరింత వేగవంతం చెయ్యాలని రైల్వే శాఖను కోరిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు.

3. రాబోయే రెండేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి చేస్తామన్న మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.

4. విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత.

5. పామాయిల్ సాగు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వెల్లడించిన వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో జనాభా నిర్వహణ విధానంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో యువత జనాభా తగ్గుదలని నివారించడం, జనాభా సమతుల్యతను సాధించడం, పెరుగుదలను ప్రోత్సహించడం, యువ శ్రామిక శక్తిని పెంచడం వంటి అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మధ్యాహ్నం కుటుంబ ప్రయోజన నిర్వహణ వ్యవస్థపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల పనులను మరింత వేగవంతం చెయ్యాలని రైల్వే శాఖను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. ఢిల్లీ లోని రైల్ భవన్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తో రామ్మోహన్ నాయుడు నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్, శ్రీకాకుళం జిల్లాలో రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతంపై చర్చించారు. శ్రీకాకుళం నుండి సికింద్రాబాద్, తిరుపతికి నేరుగా రైళ్లు, మందస రోడ్, పాతపట్నం హరిశ్చంద్రపురం స్టేషన్లలో ముఖ్యమైన రైళ్ళ నిలుపుదల, కామేశ్వరీపేట హాల్ట్ స్టేషన్ అభివృద్ధి, ఎన్‌హెచ్-16 పక్కన ఉన్న హరిశ్చంద్రపురం స్టేషన్‌ను లాజిస్టిక్స్ కేంద్రంగా నవీకరించడం వంటి అంశాలపై కేంద్ర మంత్రి వివరించారు.

---------------------------

నాలుగు రోజుల విరామం తర్వాత రాష్ట్ర శాసనసభ సమావేశాలు తిరిగి ఈ రోజు ప్రారంభమయ్యాయి. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను ప్రారంభించారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు, రెవెన్యూ శాఖ అపరిష్కృత కేసులు, సింహాచలం పంచ గ్రామాలలో అనధికారిక నిర్మాణాలు, విశాఖపట్నం జిల్లాలో పరిశ్రమలు, కోనసీమలో ఎంఎస్ఎంఈ పార్కులు, గృహ నిర్మాణ కాలనీల్లో మౌలిక సదుపాయాలు, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి అంశాలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇవ్వనున్నారు. సభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి.

---------------------------

రాబోయే రెండేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం –పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శాసనసభ సమావేశ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు –పిపిపి విధానంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, 17 కళాశాలల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు అందించే ఆర్థిక సాయం పథకం– సాస్కి కింద 3 మంజూరయ్యాయని వీటి మొత్తం వ్యయం 8 వేల 480 కోట్ల రూపాయలుగా ఉందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటివరకు 9 వందల కోట్ల రూపాయల పనులు చేపట్టిందని మంత్రి వివరిస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

శాసన సభ సమావేశాల్లో భాగంగా విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత శాసనసభలో ఈ రోజు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైయ్యాయని, ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

---------------------------

పంట వైవిధ్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, భూసారం పెంచటానికి సూక్ష్మ పోషకాలు అందిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా సేంద్రీయసాగు ప్రత్యామ్నాయ పంటలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రైతులు పామాయిల్ పంటపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పామాయిల్ సాగుకు లాభాలు వస్తున్నాయని పామాయిల్ పంట పండించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

చిత్తూరు జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో ఈ రోజు ఐదుగురు మృతి చెందారు. జిల్లాలోని

గంగవరం మండలం వైయస్సార్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారని అన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

---------------------------

విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 6 వ తేదీ నుంచి 8 తేదీ వరకు జరిగే మహా కుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మి శ తెలిపారు. దేవస్థానంలో కుంభాభిషేకానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ నిర్వహణ అధికారి శీనా నాయక్ తో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, 12 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ప్రయోజనాలను పొందేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ సమావేశం జరిగింది. విద్యుత్ రంగంలో సేవల విస్తరణ... అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రధానమంత్రి కుసుమ్ పథకం ఉద్దేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, వ్యవసాయ రంగంలో సౌర విద్యుత్ వ్యవస్థలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని విద్యుత్ రంగ సేవలను, ఉపకేంద్రాల వివరాలను, గణంకాలను వివరిస్తూ నివేదికలు రూపొందించాలని ఆదేశించారు.

---------------------------

నందిగామ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2 కోట్ల 40 లక్షల రూపాయల నిధులు మంజూరైయ్యాయని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆమె ఈ రోజు మాట్లాడుతూ, రహదారులు, భవనాలు – ఆర్ & బి శాఖ ద్వారా ముఖ్యమైన రహదారి అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు తెలిపారు.వీటి ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

=====================